సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం, 31, మే, 2023



అత్తింటి ఆరళ్లకు అబల బలి
అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులు భరించలేక ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. - 8లో



సిద్దవటం రేంజిలో కూంబింగ్
సిద్దవటం రేంజిలోని రోళ్లబోడు, సిద్దవటం, గొల్లపల్లె బీట్లలో కూంబింగ్ నిర్వహించినట్లు రేంజర్ ప్రసాద్ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.240	రూ.320
రెండోరకం	రూ.140	రూ.238



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 899 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	400
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 448.60 కిలోలు

న్యూస్‌రీల్

బదిలీలపై మాయమాటలు నమ్మవద్దు

వైవీయూ : ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో కొందరు మోసగాళ్లు విద్యాశాఖలో సెక్షన్ ఆఫీసర్స్ అని చెబుతూ డబ్బు అడుగుతున్నారని, వారి మాయమాటలు నమ్మవద్దని డీఈఓ వై.రాఘవరెడ్డి తెలిపారు. రాఘవులు అనే వ్యక్తి తెలంగాణ యాసలో తెలుగు మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీసులో సెక్షన్ ఆఫీసర్ అని చెప్పి బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తామని 8520095158 సెల్ నంబర్ ద్వారా ఫోన్ చేసి ఫోన్ పే ద్వారా డబ్బు వసూలు చేస్తున్నాడని తెలిసిందన్నారు. అలాంటి వ్యక్తి చేతుల్లో మోసపోవద్దని.. బదిలీలు, పోస్టింగ్‌లు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు



కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌర్ణమి సందర్భంగా కడప డిపో నుంచి అరుణాచలం (తిరువన్నామలై)కు సూపర్ లగ్జరీ సర్వీసును నడపనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు తెలిపారు. ఇందుకు సంబంధించి పెద్దలకు రూ.1050 రానుపోను ఛార్జీగా నిర్ణయించామన్నారు. ఈ సర్వీసు జూన్ 2వ తేది రాత్రి 9 గంటలకు బయలుదేరుతుందని వివరించారు. అనంతరం 3వ తేదిన అరుణాచలం నుంచి రాత్రి 8 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి కడపకు చేరుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఖేలోఇండియాలో వైవీయూ క్రీడాకారులకు పతకాలు





కాంస్యపతకం సాధించిన వైవీయూ క్రీడాకారిణి బెర్నాలీ బోరాకు, షేక్ మొహిద్దీన్

వైవీయూ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గౌతమబుద్ధనగర్‌లోని గౌతమబుద్ధ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఖేలోఇండియా పోటీల్లో కడప యోగివేమన విశ్వవిద్యాలయం క్రీడాకారిణి జాతీయస్థాయిలో రాణించి పతకం కైవసం చేసుకుంది. వెయిట్‌లిఫ్టింగ్ సీనియర్ మహిళల విభాగంలో వైవీయూ పరిధిలోని జమ్మలమడుగు సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని బెర్నాలీ బోరాకు 49 కేజీల విభాగంలో మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించింది.

అదే విధంగా అథ్లెటిక్స్ పోటీల్లో వైవీయూ నుంచి ప్రాతినిధ్యం వహించిన షేక్ మోహిద్దీన్ హైజంప్‌లో 2.06 మీటర్లలో కాంస్యపతకం సాధించారు. కాగా ఈయన బద్వేలు ఎస్.బి.వి.ఆర్. డిగ్రీ కళాశాలలు చదువుతున్నాడు. విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రతిభపై వైవీయూ వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

దేశీకి ప్రాణం.. ధరిత్రికి ప్రణామం

- 'దేశీ'కి ప్రాణం.. ధరిత్రికి ప్రణామం
- అయ్యవారి పల్లెలో దేశీయ వంగడాల పరిమళం
- ప్రకృతి సేద్యంతో ప్రయోగం
- దాదాపు పది రకాల విత్తనాల తయారీ
- తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు, ఆదాయం

రసాయనిక మాయలో చిక్కుకున్న సమాజానికి సాంప్రదాయ సాగుతో కాయకల్ప చికిత్స జరుగుతోంది. సహజాహార ఉత్పత్తుల యజ్ఞం కర్షకుల స్వేదంతో ప్రజ్వలిల్లుతోంది. వ్యవసాయ, ఉద్యాన రంగంలో ఆధిపత్యం చెలాయిస్తున్న హైబ్రీడ్ విత్తనాలకు ప్రత్యామ్నాయంగా దేశీయ వంగడం పునఃప్రాణం పోసుకుంటోంది. సాంప్రదాయ వంగడాల తయారీతో పాటు ప్రయోగాత్మకంగా పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ.. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం అయ్యవారి పల్లెకు చెందిన రైతులు ఔరా!అనిపిస్తున్నారు.

సాక్షి, కడప డెస్క్ : దేశీయ విత్తనాలు మొదలు వంగడాలు, పంటల సాగుకు సేంద్రీయ పద్ధతుల్లో తయారు చేసిన ఎరువులనే వినియోగిస్తూ రైతులు ప్రకృతికి ప్రణామం చేస్తున్నారు. హైబ్రీడ్ రకాలకు దీటుగా బ్లాక్‌రైస్, నల్ల, పసుపు రంగు కార్యెట్లు, వంగపూత రంగు బీన్స్, రంగురంగుల మిరప, టమాటాల సాగుకు అవసరమైన దేశీయరకం విత్తనాలను సృష్టిస్తున్నారు. ఇలాంటి పంటలే ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, నాగాలాండ్, మిజోరం, త్రిపుర, సిక్కింలో సాగవుతుండటం విశేషం.

2016లో శ్రీకారం

అయ్యవారిపల్లెకు చెందిన కొందరు రైతులు కర్ణాటక, తెలంగాణ, మైసూర్ ప్రాంతాల నుంచి మొదటగా వరిలో దేశీయ రకం.. అందులో కొత్త రకాలైన బ్లాక్‌రైస్, పంచరత్న, నవారాల వడ్లను తెచ్చి పంటల సాగు చేశారు. సాధారణ వరి పైరు మూడు అడుగుల మేరకు ఎత్తు పెరుగుతుంది. దేశీయ రకం వరి పైరు 8.5 అడుగుల ఎత్తు పెరిగి ఎకరానికి 30 బస్తాల దిగుబడి వస్తుంది. మంచి దిగుబడితోపాటు సాధారణ బియ్యం కంటే భిన్నంగా మూడురెట్ల అధిక ఆదాయం వస్తుంది.



ఎనిమిది అడుగుల మేరకు పెరిగిన పంచరత్న వరి పైరు

వీటిని మార్కెట్‌కు తరలించకుండా విత్తనాలుగా మార్చి పరిసర ప్రాంతాల రైతులకు విక్రయిస్తున్నారు.

కూరగాయల్లో కొత్త రకాలు

గత మూడేళ్లుగా కూరగాయల్లోనూ దేశీయ రకం కొత్త వంగడాలపై దృష్టిసారిస్తున్నారు. తొలుత వివిధ ప్రదేశాల నుంచి కొత్త విత్తనాలను తీసుకొచ్చి.. ప్రయోగాత్మకంగా సాగు చేసిన అనంతరం వాటి ఫలితాలను బట్టి దేశీ వంగడాల నారులు పోస్తున్నారు. కూరగాయల్లో ముఖ్యంగా టమాటా, బ్లాక్ క్యారెట్, పసుపురంగు క్యారెట్, వంగపూత కలర్‌బీన్స్, విభిన్న రంగుల మిరపకాయలు, బత్తాయి, వంగ, చిక్కుడు రకాల దేశీయ విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

గుమ్మడి కాయ టమాటా

దేశీయ రకంలోనే రైతుల హైబ్రీడ్‌ను పోలిన రంగుల కూరగాయలను పండిస్తుండటం విశేషం. సాధారణ క్యారెట్ ఎరుపురంగులో ఉంటే ఇక్కడి క్యారెట్ కోస్తే నలుపు, పసుపు వర్ణాల్లో కనిపిస్తుంది. దేశీయ రకం కొత్త వంగడాల్లో ఒకే టమాటాలో పసుపు,ఎరుపు, వంగపూత రంగులు ఉంటున్నాయి. టమాటాల ఆకారం కూడా గుమ్మడి కాయ ఆకారంలో ఉంటూ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇక్కడి బీన్స్ ఆకుపచ్చ రంగులో కాకుండా వంగపూత, పర్పుల్ వర్ణాల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. మిర్చిలో అయితే గులాబీ, వంగపూత రంగులతో పాటు ఇంకా ఏడు రంగులు కలిసి ఉన్న కాయలు పండిస్తుండటం ఇక్కడి ప్రత్యేకత. మరోరకం మిర్చిలో పూర్తిగా గులాబీ, పసుపు, వంగపూత, ఆరెంజ్ రకాలు ఉన్నాయి. మిర్చిలోనే లైలాలుంగీ, ఫ్లైయింగ్ సాచూర్, గాంధారీ, చంద్‌మెన్షా రకాలను మైసూర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని సాగు చేస్తున్నారు.

స్వయంగా సేంద్రీయ ఎరువుల తయారీ

దేశీయ రకం వరి వంగడాల పంటలన్నీ సేంద్రియ ఎరువులతోనే సాగు చేస్తున్నారు. ముందుగా పంటలు, కూరగాయల తోటలు సాగు చేసే సమయంలో పూర్తి స్థాయిలో సేంద్రీయ ఎరువులను భూమిలో కలియదున్ని విత్తనాలు వేస్తున్నారు. సహజ సిద్ధంగా లభించే కొన్నిరకాల ఆకులు, ఆవు పేడ, మూత్రం, వేపాకులతోనే సేంద్రియ ఎరువులను రైతులే స్వయంగా తయారు చేసుకుంటున్నారు. పంటలకు సోకే అన్ని రకాల తెగుళ్ల నివారణకు, పంటల అధిక దిగుబడులకు వీటినే వినియోగిస్తున్నారు.

కిచెన్ గార్డెన్లలోనూ..

రైతులతో పాటు ఔత్సాహికులు తమ ఇళ్ల పరిసరాల్లోని కిచెన్ గార్డెన్‌లలో కూడా దేశీయ వంగడాలను సాగు చేస్తున్నారు. అయ్యవారి పల్లెకు వచ్చి ఇక్కడ దేశీయ రకం కొత్త వంగడాలు, విత్తనాలు కొనుగోలు చేసి తమ ఊళ్లకు తీసుకెళ్లి పెరట్లో వేసుకుంటున్నారు.



మూడు రకాలుగా ఉన్న కొత్తరకం దేశీయ టమాటా



ఆకర్షణీయమైన రంగుల్లో కొత్తరకం మిరపకాయలు



పసుపురంగులో ఉన్న క్యారెట్

స్వదేశీ రకాలతో సంపూర్ణ పోషకాలు

బ్లాక్ రైస్, పంచరత్న, నవారా రకం బియ్యం సాధారణ బియ్యం కంటే భిన్నమైన రంగు కలిగి ఉంటాయి. పరిమాణంలో వ్యత్యాసం ఉంటుంది. ఈ రకాల పంటలు నాలుగు నెలల కాలంలోనే దిగుబడి ఇస్తాయి. రంగుతో పాటు సాధారణ బియ్యం కంటే వీటిలో అధిక పోషకాలు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. మార్కెట్‌లో ఈరకం బియ్యానికి ఎక్కువ డిమాండ్ ఉంది. బయట కిలో బ్లాక్‌రైస్ రూ.300, పంచరత్న బియ్యం రూ.120 వరకు ధర పలుకుతోంది. దేశీయ రకం కూరగాయల కొత్త వంగడాల్లో పంట సాగుకు సాధారణ పంటలకు అయ్యే ఖర్చు అవుతుందని వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. హైబ్రీడ్ రకాలతో పోలిస్తే వీటిలో అధిక పోషకాలు ఉన్నాయని అవగాహన కల్పిస్తున్నారు.

అధిక దిగుబడితో మంచి ఆదాయం



కొత్తరకం దేశీయ వంగడాల కూరగాయల సాగుతో అధిక దిగుబడి, మంచి ఆదాయం వస్తుంది. సాధారణ కూరగాయల పంటల సాగుకు ఆయ్యే ఖర్చుకంటే కుడా వీటి సాగుకు తక్కువ ఖర్చు ఉంటుంది. రెండెకరాల సాగుతో విత్తనాలు తయారు చేయడమే కాకుండా మార్కెట్లో మంచి ధరలకు కూరగాయలను విక్రయించాను. ఎకరం మిర్చికి కనీసం రూ. 2లక్షల ఆదాయం వస్తుంది.

– చెంగల్రాయలు, రైతు, అయ్యవారిపల్లె

విత్తనాలు తయారు చేస్తాం



దేశీయరకం కూరగాయలు, క్యారెట్ల పంటలు సాగు చేసి వాటి విత్తనాలను తయారు చేస్తాం. బ్లాక్, ఎల్లో రకం క్యారెట్లు, బీన్స్‌తో పాటు ఇతర రకాల కూరగాయల విత్తనాలను స్వయంగా తయారు చేస్తాం. వీటిని ఇతర ప్రాంతాల రైతులకు సరఫరా చేస్తాం. చాలా మంది వారి పెరట్లో సాగు చేసుకొనేందుకు మా దగ్గర విత్తనాలు తీసుకెళ్తుంటారు.

– రాజారెడ్డి, రైతు, అయ్యవారిపల్లె

సచివాలయాల్లో 1005 ఖాళీలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ కేటగిరీల్లో 1005 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 875, కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు, పులివెందుల, రాయచోటి, జమ్మలమడుగు, రాజంపేట, బద్వేలు, మైదుకూరు, ఎర్రగుంట్ల అర్బన్ పరిధిలో 130 పోస్టులున్నాయి. రూరల్‌లో హార్టికల్చర్ అసిస్టెంట్లు 116, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు 66, ఫిషరీస్ అసిస్టెంట్లు 2, మహిళా సంరక్షణ కార్యదర్శులు 46, పంచాయతీ సెక్రటరీలు (గ్రేడ్-5) 36, డిజిటల్ అసిస్టెంట్లు (గ్రేడ్-6) 43, సెరికల్చర్ అసిస్టెంట్ 1, వెటర్నరీ అసిస్టెంట్లు 426, అగ్రికల్చర్ అసిస్టెంట్లు 15, వీఆర్వో/డబ్ల్యుఆర్‌ఎస్ పోస్టులు 78, గ్రేడ్-3 సర్వేయర్లు 15, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్బన్ ఏరియాలో వార్డు సెక్రటరీలు 28, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 14, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు 24, వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు 6, ఎమినిటీస్ సెక్రటరీలు 34, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రామ, వార్డు సచివాలయ ఖాళీల వివరాలను కడప.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే సచివాలయ సిబ్బంది ఖాళీల వివరాలను పైన తెలిపిన వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపారు.

నవశకం.. నాలుగేళ్ల సంబరం

- జగనన్న నేతృత్వంలో అందరికీ సంక్షేమం
- నాలుగేళ్ల సంబరాల్లో పార్టీ శ్రేణులు
- రాజంపేటలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించిన ఆకేపాటి
- రైల్వేకోడూరులో బైక్ ర్యాలీలో పార్టీ శ్రేణులు
- రాయచోటిలోనూ ఘనంగా వేడుకలు

సాక్షి రాయచోటి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి. అన్ని వర్గాల ప్రజలతోపాటు పార్టీ నాయకులు నాలుగేళ్ల పండుగను నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరకాలం వర్ధిల్లాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించాయి. మరో 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ కొనసాగేలా దేవుడు ఆశీర్వదించాలని వారు కోరుకున్నారు.

- అన్నమయ్య జిల్లా రాజంపేటలోని ఆకేపాడు భవన్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో అమలు చేస్తున్న పథకాలను వివరించడంతోపాటు ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనాలను విశదీకరించారు.



రాజంపేటలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

- అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష ఆధ్వర్యంలో ఘనంగా నాలుగేళ్ల పాలనా వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ కేకును ఫయాజ్‌బాష కట్ చేసి పంచి పెట్టారు.
- రైల్వేకోడూరులోని పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా అక్కడ భారీ కేకును అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డిలు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం సుకుమార్‌రెడ్డి, ధ్వజారెడ్డి నేతృత్వంలో పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు భారీ బైక్ ర్యాలీలో పాల్గొని టోల్‌గేట్ వద్దగల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా పండుగ వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించారు.



రైల్వేకోడూరులో కేక్ కట్ చేస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి



రాజంపేట : సుండుపల్లెలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సారా రహిత జిల్లాగా అన్నమయ్య

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లాను సారా రహిత జిల్లాగా రూపొందించడానికి జిల్లా యంత్రాంగం, పోలీసుశాఖ సమన్వయంతో కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ గంగాధర్ రావు పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ గంగాధర్ రావుతో కలిసి జిల్లాలో నాటుసారా నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో నాటుసారా నిర్మూలనకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సంవత్సర కాలం నుంచి నాటుసారా తయారు చేస్తున్న 200 మందిని గుర్తించి వారిలో అవగాహన కల్పించి ఆ వృత్తి నుంచి బయటకు తీసుకువచ్చామన్నారు. వారందరికీ ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయించామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 120 మందికి ఉపాధి మార్గాలను చూపామన్నారు. ప్రస్తుతం మరో 40 మందికి ఉపాధి మార్గం కోసం రూ. 49.30 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో మదనపల్లిలో 15, పీలేరులో 15 చొప్పున ఎస్టీ తండాలకు చెందిన 30 కుటుంబాలు, వాయల్పాడులో 10 బీసీ కుటుంబాలను గుర్తించి ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. వీరందరూ తిరిగి అదే వృత్తిలోకి పోకుండా పోలీసుశాఖ పర్యవేక్షణ చేయాలని సూచించారు. వీరికి జీవనోపాధి కోసం గొర్రెలు, బర్రెలు, ఆవులు, ఆటోలకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు.

జిల్లా ఎస్పీ గంగాధర్ రావు మాట్లాడుతూ జిల్లాలో రాయచోటి, మదనపల్లిలో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు తరచూ తండాలలోకి వెళ్లి నాటుసారా తయారు చేయకుండా అవగాహన కల్పిస్తుందన్నారు. సారా నిర్మూలనలో భాగంగా 11 మందిపై జిల్లా బహిష్కరణ, నలుగురిపై పీడీయాక్టు అమలుకు ప్రతిపాదించినట్లు ఎస్పీ తెలిపారు.

ఉపాధికి ఆర్థిక సాయం..

నాటుసారా తయారీ నుంచి బయటకు వచ్చిన మదనపల్లి, పీలేరు వాయల్పాడుకు చెందిన 40 కుటుంబాలకు రూ. 49.30 లక్షల చెక్కును కలెక్టర్, ఎస్పీల చేతులు మీదుగా అందజేశారు. ఈ నిధులతో ఉపాధి మార్గాన్ని చేపట్టి మరింత మందికి ఆదర్శంగా నిలవాలని వారు సూచించారు. ఈ సమావేశంలో పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సారా తయారీ మానుకుని ఉపాధికోసం ముందుకొచ్చిన వారికి చెక్కులను అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

వచ్చే వారం మళ్లీ వస్తా..

రాజంపేట : చెయ్యేరు వరదపీడిత గ్రామమైన పులపత్తూరుకు మళ్లీ వచ్చేవారం వస్తా. ఆలోగా పనులన్నీ పూర్తికావాలి అని కలెక్టరు గిరీషా పీఎస్ వివిధ శాఖల అధికారులను హెచ్చరించారు. మంగళవారం వరదపీడిత గ్రామాలైన పులపత్తూరు హరిజనవాడ, అరుంధతీవాడలో ఇళ్ల నిర్మాణం పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి , అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల ద్వారా అడిగి తెలుసుకొని అధికారులకు కలెక్టరు పలు సూచనలు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 20 లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. వచ్చే మంగళవారం కల్లా 60 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. పదిరోజుల నుంచి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఒకటి కూడా బిల్లు ఎందుకు పెట్టలేదని హౌసింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు సరఫరా నిమిత్తం స్టోరేజి ట్యాంక్‌లను ఏర్పాటుచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ భాస్కర్, హౌసింగ్ పీడీ శివయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్న కుమార్, తహసీల్దారు సుబ్రమణ్యం రెడ్డి, ఏఈ ఈశ్వరరాజు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం పనులను ముమ్మరం చేయండి

రాయచోటి : క్రికెట్ స్టేడియం పనులను ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని శివారు ప్రాంతమైన నక్కవాండ్లపల్లె సమీపంలో చురుగ్గా జరుగుతున్న క్రికెట్ స్టేడియం భూమి చదును పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. బోరు బావులు తవ్వించి వారంరోజుల్లో నీటివసతిని కల్పించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈని కలెక్టర్ ఆదేశించారు. అలాగే క్రికెట్ స్టేడియంకు విద్యుత్ సరఫరాను త్వరగా ఇవ్వాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈని ఆదేశించారు. అప్రోచ్ రోడ్డు, బీటి రోడ్డు పనులను కూడా పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్; ఆర్ అండ్ బీ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేయవద్దు

కడప రూరల్ : స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన శిక్షలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌పై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కానింగ్ సెంటర్లు, అబార్షన్‌లు ఎక్కువగా జరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడ, మగ ఎవరైనా ఒకటే అని అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా సరే లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలకు అడ్డుకట్ట వేయడానికి గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, వైద్యులు మల్లేశ్వరి, వెంకటచంద్రారెడ్డి, ప్రమోద, బాలక్రిష్ణ, డేవిడ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



డీ సెంటు ఇళ్లు

పేదల సొంతింటి కల సాకారమవుతోంది.
రాష్ట్ర సర్కారు చేపట్టిన
'నవరత్నాలు- అర్హులందరికీ ఇళ్లు'
పథకం అద్భుతాలు సృష్టిస్తోంది.
ఇళ్లు కాదు.. ఏకంగా ఊర్లు
పుట్టుకొస్తున్నాయి.
ప్రభుత్వం ఒక సెంటు స్థలం ఇచ్చినా..
లబ్ధిదారులు అందులో చూడచక్కనైన
ఇల్లు నిర్మించుకుంటున్నారు.
ఇళ్లు నిర్మిస్తున్న తీరు, అందులో ఏర్పాటు
చేసుకుంటున్న వసతులను చూస్తే
నిజంగా ముచ్చటేస్తుంది.
కడప నగరంలోని వైఎస్సార్ జగనన్న
కాలనీల్లో ఈ దృశ్యాలు కనిపించాయి.
(సెంటు స్థలంలో సమాధులు తప్ప,
మరేం నిర్మించలేమని ప్రతిపక్షనేత చంద్ర
బాబు వ్యాఖ్యానించడంపై పేదలు ఆగ్రహం
వ్యక్తం చేస్తున్నారు. ఈ అందమైన లోగిళ్లను
చూస్తే ప్రతిపక్షాలు నోరెళ్లబెట్టక తప్పదు.)

–సాక్షి ఫొటోగ్రాఫర్











ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ,
జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు వారి కార్యాలయము, అన్నమయ్య
రెండవ దశ (స్టేజి–2) టెండరు ప్రకటన
నెం. పి. డి. యస్. 5/ స్టేజ్ -2/2023-25 తేదీ : 30.05.2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్, అన్నమయ్య జిల్లా వారు బియ్యము, కందిపప్పు, పంచదార మరియు పామాయిల్ ప్రభుత్వము వారు నిర్ణయించినట్టి ఇతర నిత్యావసర వస్తువులను ఈ క్రింది వివిధ మండల స్థాయి గోదాములకు/ చౌకదుకాణములకు/ గ్రామ లేక వార్డు సచివాలయములకు మరియు ప్రభుత్వము వారు సూచించిన ప్రదేశములకు స్టేజ్ 2 క్రింద రవాణా చేయుటకు ఆసక్తి గల వారి నుండి సీల్డ్ టెండర్లు కోరడమైనది.

అన్నమయ్య జిల్లాలోని 12 (పన్నెండు) మండల స్థాయి గోధాములకు అనగా
1. బి.కొత్తకోట 2.చిన్నమండెం 3.కలకడ 4.కలికిరి 5.రైల్వే కోడూర్ 6.లక్కిరెడ్డిపల్లి 7.మదనపల్లి 8.పీలేరు 9.రాజంపేట 10.రాయచోటి 11.తంభాలపల్లె 12.వాయల్పాడు జిల్లాలోని మండల స్థాయి గోదాము నుండి బఫర్ గోధాములకు/ చౌకదుకాణములకు లేక గ్రామా/వార్డు సచివాలయములకు దూరముతో సంబంధము లేకుండా క్వింటాల్ ఒక్కింటికి ఫ్లాట్ రేటు వేయవలెను. జిల్లాలో గల మండల స్థాయి గోదాములకు విడివిడిగా టెండర్లను వేయవలెయును. మండల స్థాయి గోదాములు, వాటికి అనుబంధించిన మండలములు, కేటాయించబడిన సరుకుల వివరములు మరియు యూనిట్ కాస్ట్ టెండర్ షెడ్యూల్‌తో పాటు పొందవలెను.

టెండరు కాల పరిమితి : టెండరు ఖరారైన తేదీ నుండి 31.03.2025 వరకు
టెండరు ఫారములు అమ్మకము తేది: 01.06.2023 నుండి (పని దినాలలో, పనివేళల్లో)
టెండరు ఫారములు అమ్ముటకు ఆఖరి తేదీ : 08.06.2023 సాయంత్రం 5:00 గం.ల వరకు
టెండరు స్వీకరించు తేది: 13.06.2023 మధ్యాహ్నం 1.00 గం.ల వరకు
టెండరు తెరచు తేది మరియు సమయము: 13.06.2023 మధ్యాహ్నం 3.00 గం.లకు
టెండరు తెరచు స్థలము : సంయుక్త కలెక్టరు వారి కార్యాలయము, కలెక్టరేట్, అన్నమయ్య జిల్లా.

టెండరు దరఖాస్తునకు జత పరచు నియమ నిబంధనలు మరియు అగ్రిమెంటును, జిల్లా పౌరసరఫరాల సంస్థ లి., అన్నమయ్య జిల్లా, రాయచోటి వారికి రూ. 8,000/- (అక్షరాల ఎనిమిది వేల రూపాయలు) ల డిమాండ్ డ్రాఫ్ట్ ఏదేని జాతీయ బ్యాంకు నుండి **DISTRICT CIVIL SUPPLIES MANAGER, APSCSCL, ANNAMAYYA** వారి పేరు మీద రాయచోటి లో చెల్లునట్లుగా చెల్లించి టెండరు దరఖాస్తును పొందవలెను.

ఏ కారణము చేతనైనను టెండర్లలో మార్పులు చేయుటకు గాని వాయిదా వేయుటకు గాని పూర్తిగా రద్దు పరచుటకు జిల్లా సంయుక్త పరిపాలనాధికారి వారికి పూర్తి అధికారముకలదు. ఈ అధికారాలను ఎవరు ప్రశ్నించ వీలులేదు.

సం/– జిల్లా సంయుక్త కలెక్టరు మరియు ఈ.ఓ.ఈ.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

సంబేపల్లెలో గాలివాన బీభత్సం



ఈదురుగాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు



దుద్యాల గ్రామంలో నెలకొరిగిన మామిడి చెట్టు

సంబేపల్లె : మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షం కారణంగా రైతులకు నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కురిసిన గాలివానకు మామిడిచెట్లు విరిగి నేలపై పడ్డాయి. మరికొన్ని చోట్ల మామిడికాయలు నేలరాలాయి. మండలంలోని దుద్యాల, శెట్టిపల్లె, సంబేపల్లె, గురిగింజకుంట, గన్నికుంట్ల, మోటకట్ల, పీఎస్ కాలనీలతోపాటు పలు గ్రామాల్లో మామిడికాయలు నేల రాలాయి. అదే విధంగా పలు ప్రాంతాల్లో ఇళ్లపై ఉన్న రేకులు, మామిడిచెట్లు నేల కొరిగినట్లు బాధిత రైతులు వాపోతున్నారు.

సిద్దవటం తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

సిద్దవటం : సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు కార్యాలయంలో మరమ్మతు పనులు చేయడంతో కార్యాలయం ఇప్పుడు చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆఫీస్‌లో రికార్డు రూమును పరిశీలించారు. బయట కాంపౌండులో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రక్షణగోడ దగ్గర దుకాణాదారులను ఎవరినీ కూడా బంకులను పెట్టనీయవద్దని తహసీల్దారుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శంకర్‌రావు, డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌క్రిష్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డలు అదృశ్యం

కలికిరి : మండలంలోని మర్రికుంటపల్లి గ్రామం పాతదళితవాడకు చెందిన తల్లి, ఇద్దరు బిడ్డలు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మురేషన్ తెలిపారు. వివరాలు.. పాతదళితవాడకు చెందిన మల్లికార్జున భార్య పల్లవి, కుమారులు ఓంప్రదీప్, అభిలాష్‌లతో ఆదివారం సాయంత్రం భర్తపై అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బంధువులు, తెలిసిన వాళ్లను విచారించినా ఆచూకీ లభించక పోవడంతో మంగళవారం మల్లికార్జున పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ ఆర్.గంగాధర్ రావు

రాయచోటి : విధి నిర్వహణలో ఉంటూ ప్రమాదాలు, అనారోగ్యం బారినపడి మృతి చెందిన పోలీసు కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు అన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా లక్ష రూపాయలను చెక్కు రూపంలో పోలీసు వితరణ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేశారు. రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన ఎస్ పెద్ద రెడ్డయ్య రాజు కుటుంబానికి ఆర్థిక సాయాన్ని ఇచ్చారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మరణించిన సిబ్బంది కుటుంబ యోగ క్షేమాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం

రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు శ్రీనివాసులకు తోటి పోలీస్ సిబ్బంది, హోంగార్డులు కలిసి ఆర్థిక సాయం అందించడంపై జిల్లా ఎస్పీ అభినందించారు. రాయచోటి సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు వై శ్రీనివాసులు రెండు రోజుల క్రిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో కుడికాలు నుజ్జునుజ్జు అయ్యింది. అతని బంధువులు, పోలీసులు కలిసి వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న హోంగార్డుకు రూ.50 వేలను అందజేశారు. ఆర్థిక సహకారం అందించిన సిబ్బంది, ఏఆర్ డీఎస్పీ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

అత్తింటి ఆరళ్లకు అబల బలి



మృతి చెందిన అనూష

మదనపల్లె : అత్తింటి ఆరళ్లకు ఓ అబల బలైంది. మండలంలోని పొన్నూటిపాళ్యం పంచాయతీ భువనేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్న అనూష అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులు భరించలేక సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన అమ్ములు, చిన్నస్వామి కుమార్తె అనూష(22)కు కర్ణాటకలోని రాయల్పాడు మండలం శునకల్ ప్రాంతానికి చెందిన అశోక్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తలిద్దరూ వివాహం తర్వాత భువనేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్నారు. వివాహ సమయంలో అనూషా తల్లిదండ్రులు అశోక్‌కు రూ.2 లక్షల నగదు, 150 గ్రాముల బంగారు ఇచ్చి వివాహం చేశారు. అలాగే కారు తీసుకోవాలంటే రూ.2 లక్షలు ఇచ్చారు. ఇది చాలక మళ్లీ అదనంగా డబ్బు కావాలని భర్త అశోక్, అత్తామామలు రెడ్డెమ్మ, కృష్ణప్పలు వేధింపులకు గురిచేస్తుండటంతో సోమవారం రాత్రి అనూష ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన భర్త వెంటనే ఆమెను కిందకు దించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరేటప్పటికే మృతి చెందడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అనూష మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని విగతజీవిగా పడి ఉన్న కూతురిని చూసి దుఃఖసంద్రంలో మునిగిపోయారు. తమ కుమార్తె అదనపు కట్నం తేలేదని అత్తింటివారే తమ బిడ్డను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరకట్న వేధింపులతోనే తమ బిడ్డ చనిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మదనపల్లె డీఎస్పీ కేశప్ప ఆస్పత్రి వద్దకు చేరుకుని ఇరు వర్గాల వారిని విచారణ చేశారు. అనూష తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త అశోక్, అత్తామామలపై వరకట్న కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

గంగమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, చైర్మన్

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మతల్లి హుండీని మంగళవారం ఆలయ కమిటీ నిర్వాహకులు, దేవదాయ శాఖ సిబ్బందితో కలిసి లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 2,44,760 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి రవీంద్రరాజు తెలిపారు. దేవదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేశారు. రెండు నెలలకు ఈ ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రబాబు, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, గోవిందాచారి, ఆలయ పూజారి ఆదిమూలం రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో 15 గొర్రెలు మృత్యువాత



మృతి చెందిన గొర్రెల వద్ద యజమాని

ములకలచెరువు : ములకలచెరువు మండలం పెద్దపాలెం దుర్గా సమీపంలో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామానికి చెందిన ఎస్ సయ్యద్ బాషా కుమారుడు ఎస్ అల్లా బక్షు గొర్రెలను మేపడం కోసం .. గ్రామ శివారులోని పొలాల్లోకి తీసుకెళ్లగా వర్షంతోపాటు పిడుగు పడటంతో 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు 1 లక్ష 80 రూపాయలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం తనను ఆదుకోవాలని ఆయన కోరారు.

పాముకాటుతో రైతు మృతి



కృష్ణప్ప (ఫైల్)

రామసముద్రం : పాము కాటేయడంతో రైతు మృతి చెందిన సంఘటన రామసముద్రం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మూగవాడికి గ్రామానికి చెందిన పుంజప్ప కుమారుడు కృష్ణప్ప (35) భార్య నాగరత్న, ఇద్దరు పిల్లలతో కలిసి ఊరికి సమీపంలో ఉన్న వ్యవసాయ బోరు వద్దకు వెళ్లారు. పాడి పశువులకు గడ్డి కోస్తుండగా విషసర్పం కాలిపై కాటేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే కుటుంబీకులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చికిత్స పొందుతూ..

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన షేక్ హజీరా బాను(27) ఈ నెల 10న అగ్ని ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ విషయాన్ని నందలూరు ఎస్ఐ చెన్నకేశవ మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మే 10న కట్టెల పొయ్యిపై టంగుటూరు గ్రామానికి చెందిన షేక్ హజీరా బాను వేడి నీళ్లు కాచుతుండగా.. అదే సమయంలో కువైట్‌లో ఉన్న తన భర్త మహేష్ ఫోన్ చేశాడు. దీంతో ఫోన్ తీసి మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తు ఆమె నైటీకి మంటలు అంటుకున్నాయి. దాంతో ఆమె మంటలను తట్టుకోలేక కేకలు వేస్తూ బయట రావడంతో ఇరుగు పొరుగు వారు ఆర్పేందుకు నీళ్లు చల్లారు. చివరకి మంటలు అదుపు కావడంతో శరీరం కాలి ప్రణాపాయ స్థితిలో ఉన్న హజీరా బానును కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయిందని, ఈ ఘటన పై మంగళవారం కేసు నమోదు చేయడం జరిగిందని నందలూరు ఎస్ఐ తెలిపారు.

సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్



రోళ్లబోడు బీటులో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజ్‌లోని రోళ్ళబోడు, సిద్దవటం, గొల్లపల్లె బీట్లలోని అత్యంత సమస్యాత్మకమైన ప్రదేశాల్లో కడప ఫ్లయింగ్ స్క్వాడ్, సిద్దవటం అటవీశాఖ అధికార సిబ్బంది కూబింగ్ నిర్వహించినట్లు రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సిద్దవటం రేంజ్‌లోని సవర్లబావి, పెంటబావి, చెంచల చెలిమి, సాకిరేవులు, ఉప్పుగుంతలు వంటి అటవీ ప్రదేశాల్లో కూంబింగ్ ముమ్మరంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి స్మగ్లర్ల జాడ గానీ, ఎర్రచందనం దుంగలు గానీ కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఫ్లయింగ్ స్క్వాడ్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, ఎఫ్‌బీఓ శ్రీనివాసులు, సిద్దవటం రేంజర్ డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, ఎఫ్‌బీఓలు రాజశేఖర్ రెడ్డి, విశ్వనాథ్, సాబ్‌బావి బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ప్రజలు తాగునీటి కోసం కడప-చెన్నై ప్రధాన రహదారిలో మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మాధవరం 1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం, రామక్రిష్ణాపురం, మహబూబ్‌నగర్, ఆలీనగర్, ఎస్‌కేఆర్ నగర్, మాధవరం-1 గ్రామాల్లో నాలుగు రోజులుగా తాగునీరు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలు మార్లు గ్రామ సచివాలయ సిబ్బందికి చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. విధిలేని పరిస్థితిలో కడప-చెన్నై ప్రధాన రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేశామన్నారు. మా సమస్యపై మండల, జిల్లా స్థాయి అధికారులైనా స్పందించి పరిష్కరించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డ సంఘటన చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. మండల కేంద్రంలోని శంఖరాపురానికి చెందిన నరసింహారెడ్డి సుండుపల్లె సమీపంలో రహదారి నిర్మాణ పనులు చేస్తున్న ఓ సంస్థలో బొలేరో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే విధులు ముగించుకొని బొలేరో వాహనంలో సంబేపల్లెకు వస్తుండగా మండల పరిధిలోని పిఎస్ కాలనీ సమీపాన తమ కంపెనీకి చెందిన మరో వాహనం ఆగిపోవడంతో గమనించాడు. ఆయన అక్కడికి వెళ్లి ఆగి ఉన్న వాహనాన్ని చూస్తుండగా కలకడ వైపు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరసింహారెడ్డిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు తరలించినట్లు సమాచారం.